క్లుప్తంగా

సాగరేశ్వరుని ఆలయంలో ఏర్పాట్లు



సాగర్‌నగర్‌లో ముస్తాబైన సాగరేశ్వరుని ఆలయం

కొమ్మాది : జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్‌లో గల సాగరేశ్వరుని ఆలయంలో బుధవారం మహా శివరాత్రి మహోత్సవాలకు ఏర్పాట్లు చేసినట్లు ఆలయ కమిటీ సభ్యులు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆ రోజు ఉదయం 5 గంటల నుంచి ఏకవార అభిషేకాలు, రాత్రి 8.30 గంటలకు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు నిర్వహించనున్నామని, పూజకు రూ.10, రుద్రాభిషేకానికి రూ.250 చెల్లించాలని తెలిపారు.

ఘనంగా పెళ్లి రాట ఉత్సవం



విలాస్కాన్‌పాలెంలో పెళ్లి రాట వేస్తున్న భక్తులు

పద్మనాభం : విలాస్కాన్‌పాలెంలోని రామ లింగేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం పార్వతి పరమేశ్వరుల పెళ్లి రాట ఉత్సవం ఘనంగా నిర్వహించారు. సోమవారం పార్వతి పరమేశ్వరుల కల్యాణం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా పెళ్లి రాట వేశారు. ముందుగా విశేష పూజలు నిర్వహించారు. అనంతరం పెళ్లి రాట వేశారు.

ఆరు మాసాలుగా కదలని పని సర్దుబాటు ఉపాధ్యాయులు

తగరపువలస : ప్రభుత్వ పాఠశాలల్లో పని సర్దుబాటు పేరుతో కూటమి ప్రభుత్వం ఆరు మాసాల క్రితం జారీ చేసిన ఆర్డర్లను కొందరు ఉపాధ్యాయులు ఇప్పటికీ ధిక్కరించిన సంఘటనలు భీమిలిలో కనిపిస్తున్నాయి. గత ఆగస్టులో పని సర్దుబాటు పేరుతో రాష్ట్ర వ్యాప్తంగా కొందరు ఉపాధ్యాయులను దగ్గరలో ఉన్న పాఠశాలలకు బదిలీ చేశారు. ఎంఈవోలు, డీఈవోలకు సంబంధం లేకుండా నేరుగా అమరావతి నుంచి విద్యాశాఖ ఆర్డర్లు జారీ చేసింది. సెప్టెంబర్‌లో కొందరు ఉపాధ్యాయులు ఈ నిబంధనలు అనుసరించి తమకు కేటాయించిన పాఠశాలలకు వెళ్లిపోగా భీమిలిలో కొందరు ఉపాధ్యాయులు ఈ నిబంధనలను నేటికీ పాటించడం లేదు. అయిదు నెలలు గడచిన తర్వాత తీరికగా కొందరు ఉపాధ్యాయులు ఈ నెల ఒకటో తేదీని తమకు కేటాయించిన పని సర్దుబాటు ప్రకారం పాఠశాలలకు వెళ్లగా చాలా మంది పాత స్కూల్‌లోనే ఉన్నట్టు తెలుస్తోంది. ఈ నెలలో పని సర్దుబాటు ప్రకారం కొత్త పాఠశాలలకు వెళ్లిన ఉపాధ్యాయులకు అక్కడ తరగతులు ఏవీ కేటాయించకపోడంతో ఖాళీగా కూర్చుంటున్నారు. ఎంఈవోలు, డీఈవోలకు సంబంధం లేకపోయినా రాష్ట్ర విద్యాశాఖ ఉత్తర్వులు ధిక్కరించి పని సర్దుబాటు పాఠశాలలకు వెళ్లని ఉపాధ్యాయులు, వెళ్లినా తరగతులు కేటాయించని యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని మిగిలిన ఉపాధ్యాయులు డిమాండ్ చేస్తున్నారు. ఈ మతలబు వెనుక మర్మం ఏమిటని వారంతా అంటున్నారు.

కార్యసాధనకు ఉత్సాహం అత్యంత ప్రధానం



ప్రవచనం వినిపిస్తున్న కోటేశ్వరరావు

మధురవాడ: ప్రలోభాలకు లోబడకుండా సీతాన్వేషణ పైనే దృష్టి నిలిపిన మహా పురుషుడు హనుమయని, ఏ కార్యం సాధనకయినా అనుకూలత, ఉత్సాహం అత్యంత ప్రధానమని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త బ్రహ్మశ్రీ డాక్టర్ చాగంటి కోటేశ్వరరావు ప్రవచనంలో వివరించారు. మధురవాడ గాయిత్రి విద్యాపరిషత్ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో సంపూర్ణ శ్రీరామాయణంలోని సుందర కాండలో లంకానగరంలో సీతాన్వేషణ ఘట్టాల గురించి వివరించారు. లంకానగరం శోభ, అంత:పురములు, గవాక్షములు, స్త్రీలు, ఆహార పదార్థాలు, వాద్యముల వంటి ఆకర్షణలకు లోబడకుండా సీతాన్వేషణ మాత్రమే సాగించారని తెలిపారు. రావణుడి అంత:పురంలో మండోదరిని చూసి సీతమ్మ అని భ్రమపడుట, సీత జాడ ఎంతకీ కనిపించకపోవడంతో నిరాశకు గురైనా, వెంటనే స్వస్థత పొంది ఉత్సాహంతో వెదికి సీత జాడ కనుగొనే ఘట్టాలను వివరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు, అష్టలక్ష్మి దేవాలయ ధర్మకర్త అన్నంరాజు సత్యనారాయణమూర్తి, ఆచార్య సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇంతింతై.. వటుడింతై

- కాలనీగా ఆవిర్భవించి.. ఆకాశహర్మ్యాల వరకు ఎదిగి..
- ప్రముఖ ప్రాంతంగా విరాజిల్లుతున్న రత్నగిరి హౌసింగ్ బోర్డు కాలనీ
- 1993లో అంకురార్పణకు బీజం
- పలు భూముల వేలంతో ప్రభుత్వ నిర్మాణాలకు భూమి కొరత



గతంలో హౌసింగ్ బోర్డు నిర్మించిన ఎంఐజీ క్వార్టర్లు



ఎంఐజీ గృహాల స్థానే కొత్తగా వెలసిన అపార్టుమెంట్లు



పీఎం పాలెం హౌసింగ్ బోర్డు కాలనీకి వెళ్లే 80 అడుగుల రహదారి

పీఎం పాలెం: చెట్టూ చేమలతో అరణ్యాన్ని తలపించేలా ఉండే పీఎం పాలెం ఆంధ్రప్రదేశ్ గృహ నిర్మాణ సంస్థ చొరవతో విశాఖలోనే ఒక ప్రముఖ ప్రాంతంగా రూపుదిద్దుకుంది. ఈ ప్రాంతం అభివృద్ధికి 1993లో బీజం పడింది. అప్పట్లో ఏకంగా 125 ఎకరాల భూమిని సేకరించి పీఎం పాలెం రత్నగిరి హౌసింగ్ బోర్డు కాలనీ నిర్మాణం ప్రారంభించారు. సేకరించిన భూమిలో 75 ఎకరాలు ప్రభుత్వ భూమి కాగా మిగతా భూమి స్థానిక రైతుల నుంచి హౌసింగ్ బోర్డు సేకరించింది. ఈ భూమిలో హెచ్‌ఐజీ, ఎంఐజీ, ఎంఐజీ-2, ఎల్‌ఐజీ, ఎల్‌ఐజీ-2లుగా మొత్తం 1511 గృహాలు నిర్మించడానికి హౌసింగ్ బోర్డు లే అవుట్లు వేసింది. అందులో పార్కులు, రహదారులకు సైతం స్థలాలు కేటాయించారు. గృహాల కోసం దరఖాస్తు చేసుకున్న వారి నుంచి స్థాయిని బట్టి రూ. 1.84 లక్షలు మొదలుకుని రూ.88 వేల వరకూ హౌసింగ్ బోర్డు వసూలు చేసి నిర్మాణ పనులు ప్రారంభించింది.

చేతులు మారిన గృహాలు..

ఈ ప్రాంతం విపరీతంగా అభివృద్ధి చెందడంతో భూముల ధరలకు రెక్కలు వచ్చాయి. ఇళ్ల స్థలాల ధరలు ఒక్కసారిగా చుక్కలనంటాయి. ఆ ప్రభావం రత్నగిరి హౌసింగ్ బోర్డుపై కూడా పడింది. కొంత మంది బిల్డర్లు రియల్టర్లుగా ఈ గృహాలు కొనుగోలు చేసి ఆ స్థలంలో అపార్టుమెంట్లు నిర్మించారు. ఒక ఇంటి స్థలంలో పదుల సంఖ్యలో ఫ్లాట్లు నిర్మించి అమ్మకాలు సాగించారు. ప్రస్తుతం ఇక్కడ చదరపు గజం రూ. 40 వేల వరకూ పలుకుతోంది.

స్థలాలు అన్యాక్రాంతం..

హౌసింగ్ బోర్డు తన ఆధీనంలో ఉన్న కోట్లాది రూపాయలు విలువ గల ప్రభుత్వ భూములను వేలం పాటల ద్వారా ప్రైవేటు సంస్థలు, వ్యక్తులకు ధారాదత్తం చేసిందన్న ఆరోపణలు ఉన్నాయి. రాబోయే తరాల కోసం ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు నిర్మించడానికి భూములు లేని పరిస్థితి ఏర్పడింది. ఇప్పుడున్న ఆర్‌హెచ్ కాలనీ, లక్ష్మీవానిపాలెం ప్రభుత్వ పాఠశాలలకు ఆటస్థలాలు లేని పరిస్థితి. అదే హౌసింగ్ బోర్డు ప్రభుత్వ భూములను వేలం వేయకుండా కాపాడి ఉంటే ఆ భూములు తర్వాతి తరాలకు ఉపయుక్తంగా ఉండేవని స్థానికులు అభిప్రాయ పడుతున్నారు.

తరలి వస్తున్న నగరవాసులు..

ఈ ప్రాంతం ప్రశాంతంగా ఉండటంతో నగరవాసులు తరలి వస్తున్నారు. పేరుకు రత్నగిరి హౌసింగ్ బోర్డు కాలనీ అయినప్పటికీ చూడబోతే ఆధునిక అపార్టుమెంట్లతో పలు కాలనీలుగా అభివృద్ధి చెందింది. జనాభా 25 వేలకు మించిపోయింది.

తిష్ట వేసిన సమస్యలు..

ఇంతగా అభివృద్ధి చెందిన కాలనీలో బస్ షెల్టర్ లేకపోవడం విచారకరం. గతంలో కారు షెడ్ కూడలి నుంచి ఆఖరి బస్టాపు వరకు నాలుగు షెల్టర్లు ఉండేవి. రోడ్డు విస్తరణ పుణ్యమా అని వాటిని తొలగించారు. ముఖ్యంగా ఆఖరి బస్టాపులో పక్కా బస్ షెల్టర్ నిర్మించకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు.

అలరించిన అన్నమయ్య సంకీర్తనలు



కుంతీ మాధవ స్వామి ఆలయంలో అన్నమయ్య సంకీర్తనలు ఆలపిస్తున్న భక్తులు

పద్మనాభం : పద్మనాభంలోని కుంతీ మాధవ స్వామి ఆలయంలో ఆదివారం సాయంత్రం అన్నమయ్య సంకీర్తనలు ఆలపించారు. అలివేలు మంగమ్మ, పద్మావతి అమ్మవారిని స్తుతిస్తూ ఆలపించిన సంకీర్తనలు అలరించాయి. విజయనగరం శ్రీహరి కీర్తనల బృందం సభ్యులు 30 మంది ఈ కీర్తనలు ఆలపించారు. కార్యక్రమంలో ఎంపీపీ కంటుబోతు రాంబాబు, వైఎస్సార్ సీపీ నాయకుడు తాలాడ పద్మనాభం, టీడీపీ నాయకులు తాలాడ పైడిరాజు, కంటుబోతు ఎర్నాయుడు పాల్గొన్నారు.

పొలాల్లోకి దూసుకుపోయిన కారు



ధ్వంసమైన కారు

కొమ్మాది : జీవీఎంసీ 4వ వార్డు కాపులుప్పాడలో పెను ప్రమాదం తప్పింది. ఆదివారం మధ్యాహ్నం బోయపాలెం నుంచి బీచ్ రోడ్డుకు అతివేగంతో వస్తున్న ఓ కారు అదుపు తప్పి కాపులుప్పాడ కల్వర్టు వద్ద పొలాల్లోకి దూసుకుపోయింది. దీంతో కారు ముందు భాగం పూర్తిగా ధ్వంసమైంది. మధ్యాహ్నం భోజన సమయం కావడంతో పొలంలో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. కారు నడుపుతున్న వ్యక్తి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

పెన్షన్ పెంపుతో 78 లక్షల మందికి ప్రయోజనం



మాట్లాడుతున్న పెన్షనర్ల సంఘం ప్రతినిధులు

తగరపువలస : ఈపీఎఫ్ - 95 కింద పెన్షన్ల మొత్తం పెంచడానికి కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంతో చిట్టివలస ప్రాంత ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ పెన్షనర్ల సంఘం ఆదివారం హర్షం వ్యక్తం చేసింది. గుజ్జు రామునాయుడు భవన్‌లో నిర్వహించిన సమావేశంలో అధ్యక్షుడు కానూరి రాంబాబు మాట్లాడుతూ ఈ నెల 28న సీబీటీ సమావేశంలో చర్చించిన తర్వాత తగు చర్యలు తీసుకోనున్నట్టు ఈపీఎఫ్ - 95 ఆందోళన కమిటీ జాతీయ అధ్యక్షుడు అశోక్‌రౌత్‌కు కేంద్ర కార్మికశాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయ హామీ ఇచ్చారన్నారు. ఈపీఎఫ్ - 95 సెంట్రల్ బోర్డు సూచనలు కూడా తీసుకోనున్నట్టు తెలిపారన్నారు. దేశ వ్యాప్తంగా 78 లక్షల మందికి ప్రయోజనం కలిగేలా రూ.7 వేలకు పెన్షన్ పెంపు డిమాండ్ చాలా కాలంగా ఉందన్నారు. ఈ నెల 28 తర్వాత పెన్షనర్లకు ఖచ్చితంగా శుభవార్త వస్తుందన్నారు. సమావేశంలో పెన్షనర్ల సంఘం కార్యదర్శి దామోదర బాబాజీ, సహాయ కార్యదర్శి మోర అప్పలరాజు, చిల్ల అప్పారావు, పంపాన సూర్యనారాయణ పాల్గొన్నారు.

తీరంలో వ్యర్థాల తొలగింపు



వ్యర్థాలు సేకరించిన సభ్యులు

కొమ్మాది: సాగర్‌నగర్ తీరంలో ఐఐఏఎం బిజినెస్ స్కూల్, వైజాగ్ వలంటీర్స్ సంయుక్తంగా బీచ్ క్లీనప్ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించారు. తీరం వెంబడి ఉన్న వ్యర్థాలు, పాలిథిన్ కవర్లను ఆదివారం తొలగించారు. పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అంటూ ప్లకార్డులను ప్రదర్శించి పర్యాటకులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైజాగ్ వలంటీర్స్ ప్రధాన నిర్వాహకులు సతీష్, వాకర్స్ ఇంటర్నేషనల్ చైర్‌పర్సన్ వంశీ, ఉమా సుందరి, వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నూకాలమ్మ ఉత్సవాల కరపత్రాలు ఆవిష్కరణ



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు

భీమునిపట్నం : భీమిలి గ్రామదేవత నూకాలమ్మ ఉత్సవాల కరపత్రాలు ఆదివారం ఆవిష్కరించారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు అల్లిపిల్లి వేణుబాబు ఆధ్వర్యంలో ఇతర సభ్యులు, భక్తులు కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 27 నుంచి 30 వరకు నాలుగు రోజులు ఉత్సవాలు ఘనంగా నిర్వహించనున్నామని తెలిపారు. 27న తొలేళ్ల ఉత్సవం సందర్భంగా రాత్రి గంట స్తంభం వేదిక వద్ద భారీ ఎత్తున బాణా సంచా కాల్చుతామని, అదే రోజు నేలవేషాలు, బళ్ల వేషాలతో ఊరేగింపు నిర్వహిస్తామని తెలిపారు. అలాగే రోజూ పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని, ఇందుకోసం ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నామని వెల్లడించారు. ఉత్సవ కమిటీ ప్రధాన కార్యదర్శి ఎచ్చర్ల హరి, కోశాధికారి పిన్నింటి ఎర్రయ్యరెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శి పాసి వినోద్‌కుమార్, కో ఆర్డినేటర్ గొపల్లి సన్యాసిరావు, కమిటీ సభ్యులు అల్లిపిల్లి నర్సింగరావు, కె.ముత్యాలరావు, మైలపల్లి లక్ష్మణరావు, ఎల్లాజీ పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన స్కూల్ బస్సు



చిట్టివలస ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద వాలిపోయిన స్తంభం

తగరపువలస : చిట్టివలస ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఆనుకుని రామకృష్ణ పబ్లిక్ స్కూల్‌కు వెళ్లే మార్గంలో ప్రైవేట్ స్కూల్ బస్సు ఢీకొట్టడంతో ఓ విద్యుత్ స్తంభం వాలిపోయింది. దీంతో స్తంభం నుంచి వైర్లు కిందకు వాలిపోయాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భీమిలిలోని వివిధ విద్యా సంస్థలకు చెందిన బస్సులు గోస్తనీ నది వంతెన అప్రోచ్ రోడ్డు వరకు ఉదయం, సాయంత్రం విద్యార్థుల కోసం వస్తుంటాయి. ఇక్కడ మలుపు తిరగడానికి అవకాశం లేకపోవడంతో బస్సులను ఈ మార్గంలో వెనక్కు తీస్తుంటారు. ఈ క్రమంలో స్తంభాన్ని ఢీకొట్టినట్టు స్థానికులు తెలిపారు. వాలిపోయిన స్తంభాన్ని సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఘనంగా బంగారమ్మ తిరునాళ్లు

పద్మనాభం : మండలంలోని పాత కొవ్వాడలో ఆదివారం బంగారమ్మ తిరునాళ్లు ఘనంగా నిర్వహించారు. ముందుగా మహిళలు అమ్మవారికి పసుపు, కుంకుమ చెల్లించి మొక్కులు తీర్చుకున్నారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఈ సందర్భంగా చిడతలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారి ఆలయ పరిసర ప్రాంతాలు విద్యుత్ దీపాలతో దేదీప్యమానంగా వెలుగొందాయి.

ఘనంగా పార్వతీపరమేశ్వరుల కల్యాణం



పార్వతీ పరమేశ్వరుల కల్యాణం జరిపించిన అర్చకులు వివేకానందశర్మ, కార్తీక్‌శర్మ

తగరపువలస : జీవీఎంసీ ఒకటో వార్డు సత్యనారాయణపేట కొండపై శివాలయంలో ఆదివారం ఘనంగా పార్వతీ పరమేశ్వరుల కల్యాణం నిర్వహించారు. మాఘమాసం ఏకాదశి ఘడియలలో అర్చకులు ఏడిద వివేకానందశర్మ, కార్తీక్‌శర్మ ఆధ్వర్యంలో కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పాల్గొని వేడుకలు తిలకించారు. ఆది దంపతులకు కానుకలు చదివించారు. కల్యాణ వేడుకల అనంతరం ఆలయ ఆవరణలో అర్చకులు భారీ అన్న సమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా వివేకానందశర్మ మాట్లాడుతూ ఏటా మహాశివరాత్రి ముందు వచ్చే ఏకాదశి వేళ పార్వతీ పరమేశ్వరులకు కల్యాణం నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందన్నారు.

ముగిసిన వ్యాసరచన, ఉపన్యాస పోటీలు

తగరపువలస : ఈ నెల 28న జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా ఆదర్శహిందీ ప్రేమీ మండలి భీమిలి అధ్యక్షుడు కె.ఎస్.ఆర్.కృష్ణారావు విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు ఆదివారం నిర్వహించారు. సీవీ రామన్ జీవిత విశేషాలపై హిందీ, తెలుగు మాధ్యమాలలో నిర్వహించిన వ్యాసరచన పోటీలలో 74 మంది, రామన్ ఎఫెక్ట్‌పై నిర్వహించిన ఉపన్యాస పోటీలో 10 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విజేతలకు ఈ నెల 28న బహుమతులు అందించనున్నట్టు కృష్ణారావు తెలిపారు.

మొరాయించిన ఆర్టీసీ బస్సుతో తిప్పలు



ఆనందపురం ఫ్లై ఓవర్ కింద మొరాయించిన బస్సును తోస్తున్న స్థానికులు



పువ్వుల మార్కెట్ వద్ద ఇక కదలనని మొరాయించిన బస్సు

తగరపువలస: ఆనందపురం మండలం వేములవలస పువ్వుల మార్కెట్ కూడలి నిత్యం అత్యంత రద్దీగా ఉండే ప్రదేశం. ఇంతలో విశాఖ నుంచి విజయనగరం వెళ్లే 222వి బస్సు కూడలికి వచ్చి కదలనంది. దీంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకూడదని ఎస్ఐ పాపారావు స్థానికుల సాయంతో ముందుకు తోయడానికి సాయం పట్టారు. అయినా సరే పువ్వుల మార్కెట్ తర్వాత మొండికేసింది. దీంతో ఇక చేసేది లేక బస్సు సిబ్బంది బోర్డు మార్చి బస్సును పక్కన పెట్టేశారు. తరచూ ఇలాంటి సంఘటనల కారణంగా ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతున్నందున వాహనాలను ఫ్లై ఓవర్ కింద నుంచి కాకుండా పాత పద్ధతిలో పై నుంచి నేరుగా పంపించాలని స్థానికులు కోరుతున్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన

పీఎం పాలెం: వారాంతపు వినోద కార్యక్రమాల్లో భాగంగా శిల్పారామం (జాతర)లో ఆదివారం సాయంత్రం 6 గంటలకు ప్రదర్శించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ప్రేక్షకులను అలరించింది. నగరానికి చెందిన సుధారాణి డ్యాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమం వినాయక స్తుతి గీతాలాపనతో కార్యక్రమం ప్రారంభం అయింది. స్వాగతాంజలి, పుష్పాంజలి నృత్యాంశం, గరుడ గమన, రామరామ తారకం, భగవద్గీత శ్లోకాల పఠనంతో అభినందనలు అందుకున్నారు. హవీష్, వర్ష, కుందన ప్రియ, సాయినిధి, పార్థు నారాయణ, భువన గీతాశ్రీ, ప్రణవ రుద్ర, గోపాలకృష్ణ పాల్గొన్నారు.

సమాచార మార్పిడితోనే విద్యార్థుల విజయం



ఐక్యరాజ్యసమితి అధ్యక్షుడు, సెక్రటరీ జనరల్, ఎగ్జిక్యూటివ్ అసిస్టెంట్‌గా విద్యార్థులు

తగరపువలస: తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య సమాచార మార్పిడి స్పష్టంగా జరిగినప్పుడే విద్యార్థి విజయం సాధిస్తాడని సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా అదనపు డైరెక్టర్ బాతా సురేష్ అన్నారు. ఆదివారం భీమిలి కేథరిన్‌లో జరిగిన స్టెమ్స్ ఫెయిర్ ఎగ్జిబిషన్ ముగింపు కార్యక్రమంలో ఆయన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఉపాధ్యాయులు ఎప్పటికప్పుడు తమ నైపుణ్యం మెరుగు పరుచుకుంటే తప్ప విద్యార్థుల సందేహాలు తీర్చడం సాధ్యం కాదన్నారు. ప్రస్తుతం విద్యార్థుల్లో అసాధారణ ప్రతిభా పాటవాలు దాగి ఉన్నాయన్నారు. తల్లిదండ్రులను పిల్లలు అనుకరిస్తున్నందున ఎల్లప్పుడూ జాగ్రత్తగా ఉంటూ చెడు ప్రభావం పడకుండా చూసుకోవాలన్నారు. ఎస్ఎస్‌టీఎల్ శాస్త్రవేత్త ఆర్.అభిషేక్‌రాజ్ మాట్లాడుతూ విద్యార్థులు విలువలతో కూడిన విద్యను అభ్యసించాలన్నారు. విద్యార్థులంతా స్టార్టప్‌లు రూపొందించే పారిశ్రామికవేత్తలు కావాలన్నారు. కేథరిన్ విద్యా సంస్థల వ్యవస్థాపకుడు ఆచార్య డేవిడ్ రతన్‌రాజ్, చైర్మన్ ఆలీవర్ ఆర్ రాయి, డైరెక్టర్ సుష్మా ఇవాంజలిన్ రాయి తదితరులు మాట్లాడారు. ఈ సందర్భంగా సాంస్కృతిక ప్రదర్శనలు, ప్రాజెక్టులు ఆకట్టుకున్నాయి.

ఆకట్టుకున్న ఐక్యరాజ్యసమితి నమూనా సభ..

స్టెమ్స్ ఫెయిర్ కార్యక్రమంలో భాగంగా ఐక్యరాజ్య సమితి కేంద్ర కార్యాలయ సమావేశం విద్యార్థులతో నిర్వహించారు. విద్యార్థులు ప్రపంచంలో వివిధ దేశాల ప్రతినిధులుగా వ్యవహరించి అధ్యక్షుడు, సెక్రటరీ జనరల్, ఎగ్జిక్యూటివ్ అసిస్టెంట్లకు తమ దేశాలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి ఇంగ్లీషులో చర్చించారు. ఆయా దేశాల ప్రతినిధుల వేషధారణతో ఉగ్రవాదం, డ్రగ్స్, పర్యావరణం, కాలుష్యం, అధిక జనాభా, యుద్ధాలు, వలసలు నివారించేందుకు పరిష్కార మార్గాలపై చర్చించారు.

ఉచిత మెగా వైద్య శిబిరానికి స్పందన



తులసీనగర్ పార్కులో జరిగిన ఉచిత వైద్య శిబిరంలో రోగితో మాట్లాడుతున్న వైద్యురాలు



పీర్‌లెస్ కాలనీలో జరిగిన పంటి వైద్య శిబిరంలో పరీక్షలు చేస్తున్న వైద్యులు

పీఎం పాలెం: స్థానిక తులసీనగర్ ఫ్రెండ్స్ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ గాదె రోశిరెడ్డి కళా వేదిక వద్ద ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 300 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ముఖ్యంగా షుగర్, బీపీ, హిమోగ్లోబిన్ పరీక్షలు నిర్వహించి అవసరమైన సలహాలు ఇచ్చారు. ఈ శిబిరంలో డాక్టర్లు కేవీఎస్ కృష్ణ ప్రసాద్, డాక్టర్ సంధ్య, డాక్టర్ మౌనిస దుర్గ, డాక్టర్ సతీష్ చంద్ర, వైద్య సిబ్బంది పరీక్షలు నిర్వహించారు. డీఐఎస్‌టీ గవర్నర్ కె. ద్వారకానాథ్ ప్రారంభించిన ఈ శిబిరంలో వాకర్స్ కమిటీ అధ్యక్షుడు చందక విశ్వేశ్వరరావు, వనితా వాకర్స్ అధ్యక్షురాలు జ్యోతి, ముఖ్య సభ్యులు తీలం ఐజాక్, వెంకటరెడ్డి, పోతిన సూరిబాబు, డాక్టర్ గౌతం చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

పీర్‌లెస్ కాలనీలో..

పీర్‌లెస్ కాలనీలో స్థానిక కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 7 గంటల నుంచి 30 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు ఉచితంగా పంపిణీ చేశారు.

నిరాశ్రయులకు నిత్యావసర సరకుల పంపిణీ



నిరాశ్రయులు, దివ్యాంగులకు నిత్యావసర సరకులు పంపిణీ చేస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

మధురవాడ: మధురవాడ, బోయిపాలెం పరిసర ప్రాంతాల్లో బస్‌స్టాప్‌లు, ట్రాఫిక్ సిగ్నల్స్, ఇతర చోట్ల భిక్షాటన చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్న వారికి, దివ్యాంగులు, వృద్ధులు, ఒంటరి మహిళలకు ఆదివారం గ్రేస్ హ్యాపీనెస్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. బియ్యం, పంచదార, ఆయిల్, గోధుమనూక, గోధుమ పిండి, ఉప్మానూక, సబ్బులు, పేస్టులు తదితర 15 రకాల వస్తువులతో కూడిన కిట్స్ ట్రస్ట్ నిర్వాహకులు పోతన నవీన్ కుమార్ ఆధ్వర్యంలో అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ సంస్థ సేవా కార్యక్రమాల్లో భాగంగా ఇటువంటివి చేపడుతున్నట్టు చెప్పారు. ఇందులో పలువురు సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.